# ఒకడుగు ముందుకు రెండు వెనక్కి...

## -కె. మంజులత

నందిని బెడ్ మీద పడుకుని 'బైండింగ్ వైన్' బుక్ చదువుకుంటోంది. కాస్త ఈస్తటిక్ సెన్స్ వున్నవాళ్ళెవరయినా ఆమెనొక్కసారి చూస్తే తిరిగి చూడకుండా వుండలేరు.

సుధీర్ వచ్చేస్తే బావుండునని ఆమెకు పదే పదే అన్పిస్తోంది. సుధీర్ ఆమె భర్త. అందంలో, చదువులో, ఐశ్వర్యంలో ఆమెకు సరైన జోడీ అని అందరూ అనుకుంటూంటారు.

నందిని వాల్‌క్లాక్ వైపు చూసింది, అప్రయత్నంగా ఆమె ఒక నిట్టూర్పు విడిచింది.

నందిని 'బైండింగ్ వైన్' లో క్యారెక్టర్స్ గురించి ఆలోచిస్తోంది. శశి దేశపాండే వివాహ జీవితాల్లో ఉండే అసంతృప్తుల్ని ఎంత బాగా వ్రాసిందో అన్పిస్తోంది. కొంతమంది స్త్రీలు వివాహం తర్వాత అసలు తమ ఉనికినే మర్చిపోవటాన్ని గురించాలోచిస్తే ఆమెకు చాలా ఆశ్చర్యం వేసింది.

అలా వుండగల్గటమే మంచిదేమో! తనలాంటి వాళ్ళు ఆత్మగౌరవం, సెల్ఫ్ ఐడింటిటీ అంటూ ప్రాకులాడి చివరకు మనశ్శాంతి కూడా లేకుండా చేసుకుంటారేమో?

సుధీర్ పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఆమె నోరు తెరిచి అడగాలే గానీ ఏదీ లేకపోవటమనే సమస్యే లేదు. అసలు నోరు తెరిచి అడగాల్సిన అవసరమే ఆమెకు చాలా అరుదుగా వస్తుంటుంది. అన్నీ సుధీర్ సారధ్యంలో వాటంతటవే సమకూరిపోతుంటాయి!

కారు హారన్ శబ్దానికి నందిని ఆలోచనల్లోంచి బయటపడింది. అంటే సుధీర్ వచ్చాడన్నమాట. అసంకల్పితంగా టైమ్ చూసింది. పెద్ద ముల్లు నాలుగు, ఐదుల మధ్యలో. చిన్న ముల్లు రెండు మూడుల మధ్యలో. ఒక్కసారిగా ఆమెకు దుఃఖం ముంచుకొచ్చిందతని నిర్లక్ష్యాన్ని తలుచుకుని. అయినాసరే, తప్పుతుందా అనుకుంటూ ముఖానికి నవ్వు పులుముకుని ఎదురెళ్ళింది. ఆమె అలా వెళ్ళకపోయినా అతనేం అడగడు. నీ మనస్సు నీదే, నా మనస్సు నాదే అనే రకం అతను. కానీ ఆమెకేమో ఏదైనా సరే ఇద్దరూ కలిసి అనుభూతి చెందాలని ఉంటుంది. కానీ అతనికి తెలిసేలా ఎలా చెప్పాలో అర్థం కాదు!

సుధీర్ తీసేసిచ్చిన కోట్, టై అందుకుంటుంటే ఏదో వాసన ఆమె ముక్కుపుటాలకి ఘాటుగా తగిలింది. ఆ బ్రాండ్ స్ప్రే సుధీర్‌ది కాదే అనుకుంటుంటే ఆమె మనసు చివుక్కుమంది. అంటే-

వెతలకు మాసిందో, విధి వంచితో, లేక వలచి వచ్చిందో అందించిన అనుభవాల తీపి గుర్తుల్ని ఇంటివరకూ మోసుకొచ్చాడన్న మాట. అలాంటి సందర్భాలలోనే ఆమెకు అన్పిస్తూంటుంది, పంతంగానైనా సరే ఎవరితోనైనా కాంటాక్ట్ పెట్టుకోవాలని!

కానీ తనలా చేయలేదు. అతనంటే పురుషపుంగవుడు కదా! ఎంతమందితోనైనా ఎఫైర్స్ పెట్టుకోవచ్చు.

సుధీర్ బాత్రూంలోంచి వచ్చి నందినిని దగ్గరకు తీసుకున్నాడు-ఆమె భుజం చుట్టూ చెయ్యేసి.

ఆమె అతి ప్రయత్నంతో అతనికి దగ్గరైంది. ఆమె పెదవులతో అతని పెదవులేవో ఊసులాడుతున్నాయి. కానీ ఆమె మనస్సు మాత్రం చాలా నిరాసక్తంగా గమనిస్తూ వుండిపోయింది.

ఇంకో పదినిముషాల తర్వాత డబుల్‌కాట్‌కి ఈ చివర ఆమె ఆ చివర అతను. నందినికి ఆ రాత్రంతా నిద్ర కరువైపోయింది. ఆలోచిస్తుంటే అన్పిస్తూంది.

తనని ఇంత చిత్రహింస పెట్టే అధికారం అతనికెక్కడిది. అతనిష్టం వచ్చినట్లు అతనుంటున్నాడు. తననీ వుండమన్నాడు. కావాలంటే తనూ ఎంతమందితోనైనా రిలేషన్స్ మెయిన్‌టెయిన్ చెయ్యొచ్చు. అంతేకానీ అతని స్వేచ్ఛావర్తనని కాదనే అధికారం తనకెక్కడిది.

ఏదో భార్యాభర్తలయ్యాక తప్పదని ఆ యింట్లో ఉండటమేగానీ, అయినా ఈ సోకాల్డ్ హై సొసయిటీలో ఎంతమంది భర్తల వెనుక ఎన్ని గొప్ప పనులు చేయటం లేదూ. కాకపోతే తనకలా చేయటం చేతకాదు.

ఇంత అసంతృప్తితో వుండే కన్నా సుధీర్‌కి డైవోర్స్ ఇచ్చేస్తే-

అమ్మో వద్దులే ఈ మాత్రం ప్రశాంతత కూడా కరువైపోతుంది. భర్త చాటున ఏం చేసినా ఫర్వాలేదు. కానీ భర్తలేకుండా ఈ సమాజంలో బ్రతకటమంటే మాటలా. అదీ ఒంటరిగా. మరేటి చేయటం? ఇంక తనకీ ఒంటరి జీవితం తప్పదేమో!

★★★

విండోపక్కన బుజ్జి పిచ్చుక ఒకటే రొద చేస్తోంటే-

మళ్ళీ తెల్లారింది కాబోలు అనుకుంటూ బెడ్‌రూమ్‌లోంచి బయటకొచ్చింది నందిని సుధీర్‌కు బెడ్‌కాఫీ ఇవ్వాలని.

రత్తి గేటు తీసుకుని లోపలకొచ్చింది.

రత్తి రోజూ పొద్దున్నే వచ్చి సాయంత్రం వరకూ వుండి వంట కార్యక్రమాలవీ చూసి వెళ్తుంటుంది.

సహజంగా తనెప్పుడూ పనివాళ్ళతో ఎక్కువగా మాట్లాడదు. అవసరం మేరకే ప్రవర్తిస్తుంది. కానీ రత్తిని మాత్రం దగ్గరగా చూస్తుంది. దాని కళ్ళలో అమాయకత్వమన్నా, దాని మనసులో నిజాయితీ అన్నా చాలా యిష్టం. మిగిలిన పనివాళ్ళలా కాదది. రత్తి కళ్ళలో అభిమానం కన్పిస్తుంది. అందుకామెతో, చనువుగా, ఆత్మీయంగా వుంటుంది.

రత్తి రావటం రావటమే పలకరించకుండా కిచెన్‌లోకి వెళ్ళిపోయింది. రోజూ రాగానే నందినితో కాసేపు మాట్లాడందే దాని మనసూరుకోదు.

ఏమిటీరోజు దీనికేమైంది అనుకుంటూ రత్తి వెనకాలే లోపలకెళ్ళింది నందిని. రత్తి కళ్ళు వాచిపోయి ఎర్రగా ఉన్నాయి. దాని ఒంటిమీద చర్మం తట్టుతేలి గాయాలు కన్పిస్తున్నాయి. అంటే-

దాని మొగుడు రాత్రి మళ్ళీ ప్రతాపం చూపించాడన్న మాట.

ఆత్రుతగా రత్తి దగ్గరకెళ్ళింది నందిని.

నందినికి చాలా బాధనిపించింది. రత్తినలాంటి పరిస్థితిలో చూసి.

తెలిసిన విషయమే అయినా మళ్ళీ అడిగింది- ''ఏమిటే ఇది?''

''అదేముందిలెండమ్మా, మా పూలరంగడు (రత్తి దాని మొగుడికి పెట్టుకున్న ముద్దు పేరు) రాత్రి మందేసుకొచ్చి పెతాపం సూయించాడు. పెళ్ళాన్ని పోసించడం మాత్రం రాదు గానీ ఎధవకి ఇలాటి వాటికేం తక్కువ లేదు'' అంది రత్తి.

''అదేంటే ముద్దూ, అంతంత దెబ్బలు కొడుతుంటే ఎందుకూరుకున్నావు. వాడికేం అధికారం వుందే నిన్నిలా హింస పెట్టడానికి?'' అని ఆవేశంగా అడిగింది.

''అదేటమ్మా అలాగంటారు. తిరుగుబోతు ఎదవైతేనేం, తాగుబోతు ఎదవైతేనేం, ఎంత పనికిరాని ఎదవైనా నాకు పతిదేవుడు గాదా. అధికారమేటమ్మా పెళ్ళయాక మనదంతా మొగుడిదే గదా. అలాగని పెద్దోళ్ళందరూ చెప్పేరు గదమ్మా. రాముడు తనని అడవిలో ఇడిసిపెట్టేడని సీతమ్మ తల్లి కోపగించిందా ఏటమ్మా. మొగుడన్నాక ఆ మాత్రం హక్కు లేదా ఏటి? నా మొగుడింకా నయమమ్మా మగతనమైనా వుంది. మా పక్కింటి సీతాలు మొగుడికైతే అదీ లేదు. అయినా అదీ తినటంలా తన్నులూ, బూతుతిట్లూ....''

''నీకీ పురాణాలన్నీ ఎవరు చెప్పేరే?''

'' మా అవ్వ చెప్పిందిలేమ్మా'' అంటూ ఫ్రిజ్‌లో కూరలు తేవటానికెళ్ళింది రత్తి.

నందిని ఉండబట్టలేక అడిగింది.

''ఏంటే రత్తీ ఈ గాయాలన్నీ నొప్పిగా లేవూ. ఎందుకే అలాంటి వాడితో నీకు. వదిలేసి వచ్చెయ్యరాదు. నా దగ్గరే వుందువుగాని.''

''నాకు ఇదేం యిష్టమయిపోయి వుండట్లేదమ్మా. రాత్రయితే ఆణ్ణి తిరిగి కొట్టాలనిపించిందమ్మా. ఖాండ్రించి ముఖం మీద ఉమ్మేయాలన్పించింది. గుండు గొరిగేసి, సున్నం బొట్లెట్టి ఊరంతా గాడిదమీద తిప్పాలన్పించింది. కానీ ఎదురు తిరిగితే మనకేనమ్మా నష్టం. మా అమ్మా అయ్యా ఎంతో బాధపడతారు. ఏదో ఒకటి. ఆడన్నా ఉంటేనే ఈ బతుకన్నా వుంటాదమ్మా. లేకపోతే కుక్కలు చింపిన ఇస్తరాకయిపోద్ది. అంతేకాని ఆడిమీద పేమేటమ్మా నాకు. ఇదంతా భరిస్తూ వుండటం నాకూ కట్టమేనమ్మా. ఆణ్ణొదిలి బయటకొత్తే, చుట్టూ గుంటనక్కలూ, తోడేళ్ళూ తయారవుతాయమ్మా, కాకుల్లా పొడిచేత్తారమ్మా మన్ని బతకనియ్యరు'' ఏడ్చేసింది రత్తి.

నందిని ఆ టాపిక్ వదిలేసి, దాన్ని పిలిచి టి.వి. ముందు

కూర్చోబెట్టింది. కాసేపయినా రిలాక్స్ అవుతుందని.

★★★

ఆదివారం.

సుధీర్ ఆ రోజు కూడా బయటకెళ్ళిపోయాడు. ఏదో వర్క్స్ వున్నాయంటూ.

నందిని మనసంతా కందిరీగల తుట్టలా తయారయింది. రత్తి జీవితం కూడా ఆమెని బాధించే విషయాల్లో ఒకటి.

సాయంత్రమవ్వగానే సుధ దగ్గరకు బయలుదేరింది ఇంక తట్టుకోలేక. ఎప్పుడైనా ఆమెకి మనసు బాగోకపోతే సుధ దగ్గరకే వెళ్తుందామె.

సుధ-నందిని కాలేజీ మేట్స్. చదువుకునేటప్పుడు వాళ్ళిద్దరి భావాలూ దాదాపుగా అన్నీ కలిసేవి. కానీ ఈమధ్య నందినికి సుధ ఆలోచనల్లో మార్పు కన్పిస్తోంది. అదేమని అడిగితే మధ్యతరగతి మనస్తత్వం అలవాటయిందిలే అంటూ నవ్వుతూ కొట్టి పారేస్తుంది.

సుధ నందినికేమాత్రం తీసిపోదు, అందంలోగాని, చదువులోగానీ, కాకపోతే ఆస్తిలోమాత్రం తక్కువే. ఆమె మధ్యతరగతి గృహిణి.

సుధ మనసు మెత్తనిది. ఆమెతో ఎవరైనా సరే పది నిముషాలు గడిపితే ఇంకో పదినిమిషాలు గడపాలనుకుంటారు. అదే ఆమె గొప్పతనం. అంతమంచి సాన్నిధ్యం నందినికింకెవరి దగ్గరా లభించదు.

నందిని వెళ్ళే సరికి సుధ చెట్లకు నీళ్ళు పెడుతోంది. నందినిని చూడగానే చాలా ఆనందపడిపోయింది. సాదరంగా ఆహ్వానించింది. బయట పోర్టికోలో ఛెయిర్స్ వేసింది.

నందిని టీ తాగదని ఆపిల్ జ్యూస్ తీసుకొచ్చింది. ఇంకా దేనికోసమో వెళ్ళబోతున్న సుధను నందిని చెయ్యిపట్టుకు లాగి తనెదురుగా ఉన్న కుర్చీలో కూర్చోబెట్టింది.

ఒక్కక్షణం ఇద్దరూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు.

సుధ చిన్నగా నవ్వింది.

నందినికి చాలా హాయిగా అన్పించింది. ఆమెకు తన గోడంతా చెప్పి మూడ్ పాడు చేసుకోవటం ఇష్టం లేకపోయింది. అందుకే సరదాగా మాట్లాడుతోంది నందిని. కానీ నందినికి సుధ కళ్ళలో విషాద ఛాయలు కన్పించాయెందుకో. ఆమె మనస్ఫూర్తిగా నవ్వట్లేదనిపించింది. అదే అడిగింది నందిని.

ఎప్పటిలా చిరునవ్వుతో కొట్టిపారేయాలని ప్రయత్నించి వీలుకాక జీరపోయిన గొంతుతో ఉండిపోయింది సుధ.

నందిని సుధ చేతిని తన చేతిలోకి తీసుకుని అడిగింది-

''ఏమైంది సుధా ఎందుకలా వున్నావు?''


''ఏమీ లేదే. ఎప్పటిలానే వున్నాను.''

''నాకు తెలుసు సుధా! నువ్వెలా వుంటావో. అయినా నన్వంత పరాయిదాన్ని చేస్తున్నావే.''

సుధ కళ్ళలో సన్నని నీటిపొర కదులుతుండగా అంది-

''చెప్తాను నందినీ. నీకూ చాలా విషయాలు తెలియాలి. మండుటెండల విసుర్లు కూడా నీకు తెలియాలి. శ్రీనివాస్ నీకు తెలుసుకదా! తెలియకుండా ఎలా వుంటుందిలే నా భర్త కదా. తనకి లేని అలవాట్లు లేవే. రేసులూ, క్లబ్బులూ అన్నీ వున్నాయి.''

''అంత డబ్బెక్కడి నుంచి వస్తుంది?''



ఏమిటీరోజు దీనికేమైంది అనుకుంటూ రత్తి వెనకాలే లోపలకెళ్ళింది నందిని. రత్తి కళ్ళు వాచిపోయి ఎర్రగా ఉన్నాయి. దాని ఒంటిమీద చర్మం తట్టుతేలి గాయాలు కన్పిస్తున్నాయి. అంటే- దాని మొగుడు రాత్రి మళ్ళీ ప్రతాపం చూపించాడన్నమాట. ఆత్రుతగా రత్తి దగ్గరకెళ్ళింది నందిని.

''మా నాన్నలాంటి కల్పవృక్షం వుండగా వాడికేం బాధ. అయినా నేనుద్యోగం చేస్తుందెందుకు? తేరగా వాడి జల్సాలకు ధారపోయటానికే. నాకీ జీవితమే చాలా అసహ్యంగా వుంది. అంత ఇష్టం లేనిదానివి విడిపోవచ్చుగా అంటావని నాకు తెలుసు. అలా బయటకొస్తే ఇంకేమయినా వుందా? మన సభ్య సమాజం బరితెగించిన దాన్నని ముద్ర వేయదూ. నాకు రకరకాల బిరుదులిచ్చేయదూ. వాళ్ళ క్యారెక్టర్ గురించి వారికనవసరం. కానీ పక్కవాళ్ళ గురించే వాళ్ళ బాధంతా. ఆహా ఏమి దేశసేవ. ఆ మహానుభావులందరికీ నా శతకోటి వందనాలు. లేకపోతే నాలాంటి వాళ్ళెందరో హాయిగా బ్రతికేయరూ! అందుకేనే గుట్టు చప్పుడు కాకుండా పిడిగ్రుద్దులు తినటమే బెటరని నిశ్చయించుకున్నాను.

'ఎక్స్‌పీరియన్స్ యీజ్ గుడ్ స్కూల్ వేర్ కాస్ట్ ఈజ్ వెరీ హై' అనే దాన్ని నేను నమ్ముతాను. అన్ని విషయాల్లోనూ నేర్చుకోవటానికి అవకాశం ఇచ్చి జీవితాన్ని శాసించే ఈ విషయంలో ఆ అవకాశం ఎందుకివ్వలేదో అర్థం కాదు. ఇప్పుడు నేనతనితో జీవించలేననే అనుభవాన్ని సంపాదించాను కానీ చెల్లించిన మూల్యం నా జీవితం.

భర్తని వదిలేసి వస్తే-

జాలిచూపులూ, సానుభూతులూ, సంస్కృతి, సంప్రదాయం బాబోయ్ ఒక్క విషయమా? అంతకన్నా చావే నయం. చూస్తూ చూస్తూ చచ్చే ధైర్యం కూడా నా మధ్యతరగతి మనస్తత్వానికి లేదే! అందుకే ఇలా మనసు చంపుకుని బ్రతికేస్తున్నాను.'' ఏడ్చేసింది సుధ.

నందిని ఆమె తల నిమురుతూ మౌనంగా ఉండిపోయింది చాలాసేపు. చీకటి పడ్డాక ఇంటికి బయలుదేరింది సుధ దగ్గర వీడ్కోలు తీసుకుని.

★★★

నందినికి రత్తి, సుధ గుర్తొచ్చారు.

రత్తి మొగుడు ఒంటిమీద కొడితే, తన భర్త మనసుమీద కొడతాడు. సుధ భర్త దేన్నీ వదలడు. కంచే చేనుమేస్తే చందంగా తయారైంది మన వివాహ వ్యవస్థ.

ఆమెకి గానుగెద్దు గుర్తొచ్చింది. చిన్నగా నిట్టూర్చింది.

ఆ రాత్రి కూడా సుధీర్ కోసం వెయిట్ చెయ్యటానికి మనఃపూర్వకంగా తయారైపోతూ!

★